క్లుప్తంగా

ఫ్యామిలీ డాక్టర్‌పై అవగాహన పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారి సీతారామలక్ష్మి

మాకవరపాలెం : ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని వైద్యాధికారి సీతారామలక్ష్మి వైద్య సిబ్బందిని ఆదేశించారు. స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం వైద్యసిబ్బంది, ఆశ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు వైద్యాన్ని చేరువ చేసేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఫ్యామిలీ డాక్టర్ ద్వారా ప్రజలు గ్రామాల్లోనే వైద్య సేవలు పొందేలా చూడాలన్నారు. దీంతోపాటు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు చేయించుకునేలా గర్భిణులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ నెల 17 వరకు ఇంటింటికీ వెళ్లి లెప్రసీ కేసుల గుర్తింపు సర్వే చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో రమేష్, ఎంపీహెచ్‌ఈవోలు గంగరాజు, జాన్సన్ పాల్గొన్నారు.

డీటీ త్రివేణి బదిలీ



రోలుగుంట : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్న హెచ్.త్రివేణి బుచ్చెయ్యపేట మండలానికి బదిలీ అయ్యారు. ఈ మేరకు మంగళవారం ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలో ఆమె నాలుగేళ్లకు పైగా విధులు నిర్వర్తించారు. గత నెల తహసీల్దార్ వెంకటేశ్వరరావు సెలవులో ఉండటంతో ఇన్‌చార్జి తహసీల్దారుగా ఆమె నెలంతా వ్యవహరించారు.

6వ తరగతి ప్రవేశ పరీక్ష 11న

రావికమతం : మరుపాక మోడల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశానికి ఈ నెల 11న అర్హత పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సత్యసునీల్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు హాల్‌టిక్కెట్లను ఆన్‌లైన్‌లో లాగిన్ అయి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు పెన్, ప్లాంక్ మినహా మరే ఇతర పరికరాలు వెంట తీసుకురాదని పేర్కొన్నారు. పరీక్ష సమయానికి అరగంట ముందుగా పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. విద్యార్థులు హాల్ టికెట్‌తోపాటు, గుర్తింపు కొరకు తమ ఆధార్ కార్డు ఒరిజినల్ తీసుకు రావాలని తెలిపారు.

విత్తనాల కోసం నమోదు చేసుకోండి

మాకవరపాలెం : రైతులు సచివాలయాల్లో వరి విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏవో చిరంజీవి తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అన్ని సచివాలయాల్లోనూ వ్యవసాయ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉన్నారని పేర్కొన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు ఆధార్ కార్డులు తీసుకువెళ్లి, వారి పేర్లను నమోదు చేయించుకోవాలన్నారు. పచ్చిరొట్ట ఎరువుగా వినియోగించే జనుము, జీలుగ, పిల్లిపెసర విత్తనాలు రైతు భరోసా కేంద్రాల్లో సిద్ధంగా ఉన్నట్టు వెల్లడించారు.

అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుకు ఆహ్వానం

మాడుగుల : మండలంలోని తాటిపర్తి పంచాయతీ గరికబంద అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుకు దరఖాస్తుల్ని ఆహ్వానిస్తున్నట్టు మాడుగుల ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి సీహెచ్ శ్రీదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీ పరిధిలోని బీసీ కేటగిరీకి చెంది, టెన్త్ ఉత్తీర్ణులై, జూలై 1 నాటికి 21 ఏళ్ల నిండి, 35 సంవత్సరాల్లోపున్న మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హులైన అభ్యర్థులు 12వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు మాడుగుల ఐసీడీఎస్ కార్యాలయానికి నేరుగా గానీ, రిజిస్టర్ పోస్టు ద్వారా గానీ దరఖాస్తు అందజేయాల్సిందిగా కోరారు.

శిథిలావస్థలో బస్ షెల్టర్



పిచ్చితుప్పలతో శిథిలావస్థలో ఉన్న కేజే పురం జంక్షన్ బస్ షెల్టర్

మాడుగుల రూరల్ : కె.జె.పురం జంక్షన్‌లో బస్సు షెల్టరు పూర్తిగా శిథిలావస్థకు చేరింది. దీన్ని ఇదే గ్రామానికి చెందిన దాతల సహకారంతో సుమారు 30 ఏళ్ల క్రితం నిర్మించారు. కాలక్రమేణా శిథిలావస్థకు చేరడంతోపాటు షెల్టర్ మీద పిచ్చి తుప్పలు పెరిగాయి. కూలేందుకు సిద్ధంగా ఉన్న దీన్ని వెంటనే తొలగించి, కొత్త షెల్టర్ మంజూరుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అభివృద్ధిలో ఆదర్శంగా దేవరాపల్లి



అంతర్గత సీసీ రోడ్ల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

- డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు
- పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం

దేవరాపల్లి : దేవరాపల్లి గ్రామ పంచాయతీని చరిత్రలో నిలిచిపోయేలా అభివృద్ధి చేసి, ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. దేవరాపల్లిలో పలు అభివృద్ధి పనులను మంగళవారం ఆయన ప్రారంభించారు. విద్యుత్ ఉప కేంద్రం నుంచి ఎస్సీ కాలనీ వరకు రూ.20 లక్షలతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్లను, శ్రీ సన్యాసమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో రూ.20 లక్షలతో నిర్మించిన సిమెంట్ ప్లాట్ ఫామ్‌లకు ప్రారంభోత్సవం చేశారు. మునుపెన్నడూ లేని విధంగా కోట్లాది రూపాయాలతో దేవరాపల్లి నుంచి ఇతర గ్రామాలకు వెళ్లే లింక్ రోడ్లను నిర్మించామన్నారు. దేవరాపల్లి నాలుగు రోడ్ల కూడలి నుంచి శారదానది వరకు రూ.50 లక్షలతో రోడ్డు విస్తరణ పనులను త్వరలో పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్రి సత్యం, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు, కొప్పల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డా.వరదపురెడ్డి సింహాచలం నాయుడు, స్థానిక సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి, కె.వి.రమణ, గుండు రాంబాబు, వాలేటి నాగరాజు, గుల్లేపల్లి మురళీ, వెంకటరాజుపురం సర్పంచ్ దాసరి సంతోష్ కుమార్, తెనుగుపూడి ఉప సర్పంచ్ కాటిపాం పెదనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే రాష్ట్రం అభివృద్ధి



వెంకటాపురం గిరిజనులకు ఓటీఎస్ పట్టాలను అందిస్తున్న ఎమ్మెల్యే గణేష్

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే గణేష్

గొలుగొండ : అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని, రాష్ట్ర ప్రజల సమగ్ర అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా నవరత్నాల పథకాలు అందిస్తున్నారని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తెలిపారు. సాలికమల్లవరం పంచాయతీలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. తొలుత గిరిజన గ్రామాలైన వెంకటాపురం, పాగచెట్లపాలెంలో పర్యటించారు. ప్రతీ గడపకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాల లబ్ధిని వివరించారు. గిరిజనులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. తాము సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలివ్వాలని గిరిజనులు కోరారు. కిలో మీటర్ మేర రోడ్డు సరిగా లేక ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. రోడ్డు నిర్మాణానికి, పట్టాల పంపిణీకి వెంటనే చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం సాలికమల్లవరంలో పర్యటించారు. గ్రామంలో డ్రైనేజీ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరారు. నిధులు మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు నాణ్యతతో కూడిన పౌష్టికాహారంతోపాటు, చిన్నతనం నుంచే చదువుపై ఆసక్తి పెరిగేలా పనిచేయాలని సూచించారు. జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఎంపీపీ మణికుమారి, పార్టీ మండల అధ్యక్షుడు సత్యనారాయణ, వైస్ ఎంపీపీ జక్కు నాగమణి, సర్పంచ్ పెదిరెడ్ల లక్ష్మి, సహకార బ్యాంక్ చైర్మన్ కె.పెద్దిరాజు, ఏఎంసీ చైర్మన్ సత్యనారాయణ, గ్రామ కమిటీ అధ్యక్షుడు అప్పలనాయుడు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం



చినపాచిల గ్రామంలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

- 'గడప గడపకు మన ప్రభుత్వం' లో ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

రావికమతం : రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలన్నింటినీ పరిష్కరించడమే తమ ప్రభుత్వం ముందున్న లక్ష్యమని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. చినపాచిల గ్రామంలో మంగళవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల అమలు తీరును తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల కోసం ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తున్నారా? అని ఆరా తీశారు. గ్రామంలో మంచినీటి ఇబ్బందులు, ఉపాధి హామీ పథకం జాబ్ కార్డులు, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలంటూ గ్రామానికి చెందిన కర్రెడ్ల అచ్చియ్యమ్మ, ములంపాక ఈశ్వరమ్మ, సాసుబిల్లి రమణమ్మ, దొడ్డి గోవిందమ్మ తదితరులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అక్కడికక్కడే ఇళ్లు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. రూ.కోటీ 12 లక్షల వ్యయంతో ఇంటింటికీ కొళాయి కనెక్షన్లు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. జాబ్‌కార్డుల గురించి ఏపీవో దాడి వెంకటఅప్పారావుతో మాట్లాడారు. తక్షణం విచారణ జరిపి, అర్హులందరికీ జాబ్ కార్డులు మంజూరు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ పైల రాజు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ముక్కా మహాలక్ష్మినాయుడు, మండల సచివాలయ కన్వీనర్ కంచిపాటి జగన్నాథరావు, కోఆపరేటివ్ సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి కొమార ప్రసాద్, మాజీ పర్సన్ ఇన్‌చార్జి జనపాల వెంకట్రావు, మాజీ జెడ్పీటీసీ ఆశరి వాసుగోవిందరావు, తహసీల్దార్ మహేశ్వరరావు, ఎంపీడీవో వెంకన్నబాబు పాల్గొన్నారు.

'గ్రీన్ మిలియన్ విజయవంతానికి కృషి'



మొక్కలు నాటుతున్న ఇన్‌చార్జి ఎంపీడీవో పోలుపర్తి పార్థసారథి

నాతవరం : మండలానికి కలెక్టరు కేటాయించిన మొక్కల్ని సకాలంలో నాటేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్టు ఇన్‌చార్జి ఎంపీడీవో పోలుపర్తి పార్థసారథి తెలిపారు. మండల కేంద్రంలోని ఖాళీ ప్రదేశాలలో వివిధ జాతుల మొక్కల్ని నాటే కార్యక్రమంలో మంగళవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జిల్లాలో కలెక్టరు కొత్తగా ప్రవేశపెట్టిన గ్రీన్ మిలియన్ కార్యక్రమంలో భాగంగా శాఖల వారీగా నాటేందుకు మొక్కల్ని కేటాయించారన్నారు. మండలానికి కేటాయించిన మొక్కలను ప్రభుత్వ కార్యాలయాల్లో ఖాళీ స్థలాల్లో వేయనున్నట్టు పేర్కొన్నారు. నాటిన ప్రతి మొక్కను విధిగా సంరక్షించే బాధ్యత కూడా శాఖల వారీగా అధికారులు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో మొక్కల పెంపకం ఉపయోగాలను విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం మర్రి లక్ష్మి, ఉపాధి హామీ పథకం ఏపీవో చిన్నారావు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు వెలుగు, ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

జోరుగా యువజన సంఘం భవన నిర్మాణం



మట్టితో గొతుల్ని కప్పే పనుల్లో శ్రమదానం చేస్తున్న సంఘ సభ్యుల కుటుంబాలు

రోలుగుంట : స్థానిక త్రివేణి జీవకారుణ్య సంఘం భవన నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. ఈ సంఘ భవనం శిథిలం కావడంతో నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని గత నెలలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి, జెడ్పీటీసీ పోతల లక్ష్మిని కలిసి వినతిపత్రాలిచ్చారు. దీనిపై స్పందించిన వారు ఎంపీ, జెడ్పీటీసీ నిధుల నుంచి చెరో రూ.5 లక్షలు నిధులు మంజూరు చేశారు. ఈ మేరకు మండల పీఆర్ జేఈ ఉమామహేశ్వరుడు స్థలాన్ని పరిశీలించి నిర్మాణానికి అవసరమైన ప్లాన్ మంజూరుచేశారు. దీంతో సంఘ సభ్యులు కుమారులు గైరమ్మ సత్యం, ఆదారి గణేష్, ఫీల్డ్‌మెన్ సత్యనారాయణ, సంఘ కుటుంబ సభ్యులు, వారి పిల్లలు మంగళవారం పనుల్లో పాల్గొని, శ్రమదానంతో గోతుల్ని మట్టితో కప్పారు.

పగలు ఎండ.. సాయంత్రం వాన



ఈదురు గాలులకు చోడవరం హైస్కూల్ గ్రౌండ్‌లో నేలకొరిగిన భారీ వృక్షం

చోడవరం : ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షం చోడవరం పరిసరాల్లో మంగళవారం ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది. ఉదయం నుంచి 40 డిగ్రీలకు అటూఇటుగా ఎండలతో జనాలు అల్లాడారు. సాయంత్రం ఒక్కసారిగా మబ్బులుపట్టి, మెరుపులు, ఉరుములు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. వెంకన్నపాలెం, గోవాడ, నర్సాపురం, భోగాపురం పరిసరాల్లో పలు చోట్ల పిడుగులు పడగా ఎటువంటి నష్టం సంభవించలేదు. ఈదురుగాలుల వల్ల చోడవరం హైస్కూల్ గ్రౌండ్‌లో భారీ వృక్షం వేర్లతో సహా నేల కొరిగింది. పట్టణంతోపాటు, పలు చోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడి, విద్యుత్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. వడ్డాది నుంచి వయా గాంధీగ్రామం, చోడవరం, గోవాడ, మామిడిపాలెం రోడ్డులో పలుచోట్ల వర్షం నీరు నిలిచిపోవడంతో వాహనచోదకులు చాలా ఇబ్బంది పడ్డారు.

డ్రగ్స్ రహిత సమాజ స్థాపనే ప్రభుత్వ ధ్యేయం



కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఐ గోవిందరావు

నర్సీపట్నం : డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని టౌన్ ఎస్‌ఐ గోవిందరావు తెలిపారు. నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధి బలిఘట్టం, పెదబొడ్డేపల్లి ప్రాంతాల్లో మంగళవారం డ్రగ్స్ నిర్మూలన కమిటీలను ఏర్పాటు చేసి, వారితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సహకారంతో డ్రగ్స్‌ను రూపుమాపేందుకు ఎక్కడికక్కడ కమిటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కమిటీల్లో రాజకీయ నాయకులు, వివిధ సొసైటీలకు చెందిన ప్రముఖులను భాగస్వాములను చేసినట్టు పేర్కొన్నారు. కమిటీ సభ్యులు డ్రగ్స్ నిర్మూలనకు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. సమావేశంలో ఎస్సై సుధాకర్, రాజకీయ పార్టీ నాయకులు శెట్టి మెహన్, గవిరెడ్డి వెంకటరమణ, మహిళా పోలీసులు, వలంటీర్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మోదమ్మ పండగ శోభ

ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం మాడుగుల మోదకొండమ్మ ఉత్సవం మంగళవారం కనుల పండువగా జరిగింది. రోడ్లన్నీ భారీ విద్యుత్ సెట్టింగ్‌లతో ధగధగ మెరిశాయి. నేల వేషాలు, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తుల్ని, సందర్శకుల్ని విశేషంగా అలరించాయి. రాజకీయ ప్రముఖులు, వివిధ స్వచ్ఛంద సంస్థలు భక్తుల సేవలో తరించాయి.

– మాడుగుల



ఆకట్టుకున్న నేలవేషాలు



బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన భారీ విద్యుత్ సెట్టింగ్‌లు



సంతబయలు వద్ద వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో అన్న సమారాధన

ఘనంగా మోదకొండమ్మ ఒడ్డు పండగ



చెరకు కాటా ఆవరణలో మోదమాంబకు పూజలు చేస్తున్న కోట్ని కుటుంబ సభ్యులు

మాడుగుల రూరల్ : మండలంలోని ఎం.కె.వల్లాపురం మాజీ సర్పంచ్ కోట్ని శ్రీరామూర్తి కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో మంగళవారం మోదకొండమ్మ ఒడ్డు పండగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీపీ వేమవరపు రామధర్మజ, మార్కెట్ కమిటీ చైర్మన్ శానాపతి కొండలరావు, ఎం.కె.వల్లాపురం, ఎం.కోటపాడు ఉప సర్పంచ్‌లు కరణం రాము, శానాపతి గంగాధర్, చింతలూరు మాజీ సర్పంచ్ కాళింగ కళ్యాణరాజు తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం



పిల్లలతో మాట్లాడుతున్న ప్రభాకరరావు

నర్సీపట్నం : రోజూ వ్యాయామం చేయటం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు పి.ప్రభాకరరావు విద్యార్థులకు సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో మంగళవారం వేసవి శిక్షణా శిబిరంలో చిన్నారులకు వ్యాయామం ఆవశ్యకత గురించి ఆయన వివరించారు. వ్యాయామం దినచర్యగా మార్చుకుంటే, ఆరోగ్యంతోపాటు, చదువులో చురుగ్గా ఉంటారని సూచించారు. పిల్లలకు ఇంగ్లిష్ అక్షరాలతో జంబ్లింగ్ గేమ్, పదాల కూర్పును గ్రంథాలయ అధికారి దమయంతి నేర్పించారు. వేసవి శిక్షణ శిబిరంలో 33 మంది పిల్లలు పాల్గొన్నారు.

ఘనంగా శోభాయాత్ర



నాగులాపల్లిలో శోభాయాత్ర

మునగపాక: నాగులాపల్లిలో మంగళవారం సాయంత్రం హనుమాన్ శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. నూతన రామాలయం నిర్మాణంలో భాగంగా ఈ శోభాయాత్ర ఏర్పాటు చేశారు. జై శ్రీరామ్ అంటూ భక్తులు నినదించారు. బుధవారం ఆలయ శంకుస్థాపనకు అవసరమయ్యే ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ శంకుస్థాపన కార్యక్రమానికి హాజరుకావాలని నిర్వాహకులు కోరుతున్నారు. కార్యక్రమంలో శ్రీ వేంకటేశ్వర స్వామి పల్లకీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎండకు అల్లాడిన ప్రజలు



ఎండ తీవ్రతకు బుచ్చెయ్యపేటలో జన సంచారం లేని ప్రధాన రోడ్డు

బుచ్చెయ్యపేట : మండలంలో మంగళవారం ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 5 వరకు ఎండ వేడిమికి అల్లాడిపోయారు. ఎండకు తోడు తీవ్ర ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరయ్యారు. చాలా వరకు ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. దీంతో రోడ్లన్నీ పగటిపూట నిర్మానుష్యంగా మారాయి.

అన్ని వర్గాలకూ సంక్షేమ లబ్ధి



ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

రోలుగుంట : కుల మతాలు, తరతమ భేదాల్లేకుండా అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదేనని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. మండలంలోని జానకిరాంపురంలో కొప్పుల వెలమ స్టేట్ డైరెక్టర్ టి.వి.రమణ, సర్పంచ్ లగుడు కృష్ణంనాయుడు, ఎంపీటీసీ అదపురెడ్డి ముసలినాయుడుతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ వీధుల్లో ఇంటింటికీ వెళ్లారు. ప్రజలను నేరుగా కలసి ప్రభుత్వం నుంచి అందుతున్న సంక్షేమ పథకాల లబ్ధిని కుటుంబాల వారీ వివరించారు. అర్హత ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలు మంజూరుకాని వారి వివరాలు తీసుకుని, సాంకేతిక లోపాలను సవరించి, వారిని అర్హులుగా చేర్చాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.ప్రభాకరరావు, మండల పీఆర్ జేఈ ఉమామహేశ్వరుడు, హౌసింగ్ ఏఈ ప్రేమానందం, ఏపీవో సూర్యమణి, ఏపీఎం సాధన, పార్టీ సీనియర్ నాయకులు పోతల లక్ష్మీ శ్రీనివాస్, గొర్లె చెల్లంనాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు మద్దు అప్పలనాయుడు, చిటికెల వెంకట సత్తిబాబు, పాచిలి రామకృష్ణ, బంటు సూర్య సన్యాసి దేముళ్లు, పోతల రాజశేఖర్, అధిక సంఖ్యలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

15 నుంచి ఆర్బీకేల్లో విత్తనాల పంపిణీ



విత్తనాల పంపిణీపై సిబ్బందికి సూచనలిస్తున్న వ్యవసాయాధికారి శైలజ

నాతవరం : ఖరీఫ్ సీజన్‌లో రైతులకు కావలసిన వరి విత్తనాలు ముందుగానే అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్టు మండల వ్యవసాయాధికారి శైలజ తెలిపారు. నాతవరం ఆర్బీకేలో మంగళవారం సిబ్బందితో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా అధికారులు ఆదేశాల మేరకు ఖరీఫ్ సాగుకు మండలానికి వివిధ రకాల విత్తనాలు 2,019 క్వింటాళ్ల కేటాయించినట్టు పేర్కొన్నారు. మండలంలోని 16 ఆర్బీకేల ద్వారా విత్తనాలను రైతులకు గ్రామంలోనే అందిస్తామన్నారు. విత్తనాలు కావలసిన రైతులు ఆర్బీకేలో ఏర్పాటు చేసిన కియోస్క్ ద్వారా తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే చాలా మంది రైతులు నమోదు చేసుకున్నట్టు పేర్కొన్నారు. నమోదు చేసుకున్న రైతులందరికీ ఈ నెల 15 నుంచి విత్తనాలు పంపిణీ చేస్తామన్నారు. ఎరువుల కోసం కూడా రైతులు ముందుగా ఆర్బీకేలో నమోదు చేసుకోవాలన్నారు. ఈ ఏడాది పచ్చిరొట్ట ఎరువులను రాయితీపై రైతులకు అందించామన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ పశు బీమాతో ధీమా



జి.అగ్రహారంలో రైతులతో మాట్లాడుతున్న పశువైద్యశాఖ ఏడీ చిట్టినాయుడు

- పశువైద్య శాఖ సహాయ సంచాలకుడు చిట్టినాయుడు

మాడుగుల రూరల్ : పాడి రైతులకు ప్రభుత్వం కల్పించిన వైఎస్సార్ పశు బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మాడుగుల పశువైద్యశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ వి.చిట్టినాయుడు కోరారు. మంగళవారం జి.అగ్రహారంలో పాడి రైతులతో నిర్వహించిన పశు విజ్ఞానబడి అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. 2 నుంచి 10 ఏళ్లలోపు వయసున్న పాడి ఆవులు, 3 నుంచి 12 ఏళ్ల లోపు వయసున్న గేదెలు, ఎద్దులను ఈ పథకంలో చేర్చవచ్చన్నారు. దీంతో పాటు దేశవాళీ, సంకరజాతి పశువులకు మూడేళ్ల కాల పరిమితికి రూ.30 వేల బీమా కోసం తెల్ల రేషన్‌కార్డు లేని రైతులు రూ.960 ప్రీమియం చెల్లించాలన్నారు. తెల్లరేషన్ కార్డున్న రైతులతోపాటు, ఎస్సీ, ఎస్టీ రైతులు రూ.384 చెల్లిస్తే సరిపోతుందన్నారు. పశువులకు వాటి విలువ మేరకు రూ.లక్షా 20 వేలు వరకు బీమా వర్తిస్తుందన్నారు. కె.జె.పురం పశువైద్యాధికారి డాక్టర్ మణిలక్ష్మణ్ మాట్లాడుతూ ఎండాకాలంలో పశువుల సంరక్షణ, దూడపెయ్యల్లో మరణాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. 75 శాతం రాయితీపై కాకిజొన్న, గడ్డి విత్తనాలు లభిస్తున్నాయన్నారు. రూ.500కే లింగ నిర్ధారిత వీర్యం, ఉచిత కృత్రిమ గర్భధారణ ఇంజక్షన్ల పంపిణీ, వైఎస్సార్ పశు సంచార ఆరోగ్య సేవలు గురించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వర్షం.. ఉపశమనం

చీడికాడ : మండలంలో వారం రోజులుగా తీవ్రమైన ఎండలు, వడగాడ్పులతో అల్లాడిన ప్రజలకు మంగళవారం మధ్యాహ్నం కురిసిన మోస్తరు వర్షం ఉపశమనం కలిగించింది. ఉదయం 8 గంటల నుంచే తీవ్రమైన ఎండలు, ఉక్కబోతతో సతమతమైన ప్రజలు కాస్త సేదతీరారు. ఈ వర్షం వేసవి దుక్కులకు మేలు చేస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.